## క్లుప్తంగా

### నేడు లక్కాకులమ్మ జాతర



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో వెలసిన లక్కాకులమ్మ దేవాలయంలో ప్రతీ ఏటా శ్రావణ మాసంలో జాతర నిర్వహిస్తారు. నేడు(బుధవారం) గణపతి పూజతో జాతర ప్రారంభమై, రేపు అమ్మవారికి అష్టోత్తర సహస్ర నామార్చనలు, అభిషేకాలు, నిత్య కుంకుమ పూజలు, ముడుపులు సమర్పించుట, తీర్థప్రసాదాలు అందించనున్నారు. అన్ని రకాల ఏర్పాటు పూర్తి చేసినట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.

### వీరభద్ర స్వామికి శ్రావణమాస మహాభిషేకం



కొత్తకొండ వీరభద్రుడు

ఎల్కతుర్తి : కొత్తకొండలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా చివరి మంగళవారం స్వామివారికి కవచాలు తొలగించి మహాన్యాస పూర్వక మహాభిషేకం నిర్వహించారు. 51లీటర్ల పంచామృత అభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మాలధారణ స్వాములు 27రోజులు నిష్ఠగా ఉండి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ ఈఓ కిషన్‌రావు, గురుస్వామి మొగిలిపాలెం రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటి సంరక్షించాలి



నడికూడ : నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ విమల అన్నారు. మంగళవారం మండలంలోని రాయపర్తి పంచాయతీని తనిఖీ చేసి, గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాతావరణం సమతుల్యంగా ఉండాలంటే సరైన సమయంలో వర్షాలు పడాలన్నారు. ఏపీఓ విద్యావతి, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### క్లబ్ మెటీరియల్ పంపిణీ



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలకు మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థి క్లబ్‌ల నిర్వహణ మెటీరియల్‌ను, మైక్ స్టాండ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి నాగబండి శివప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థి క్లబ్‌ల నిర్వహణకు పూర్తి స్థాయిలో సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, చంద్రకళ, మమత తదితరులు పాల్గొన్నారు.

### వైద్యశిబిరం



వేలేరు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మేఘన అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నవచైతన్య యూత్ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ప్రజలు తమ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. నవచైతన్య యూత్ అధ్యక్షుడు శ్రీకర్,అక్కల ప్రశాంత్,మేక రాజు,పరమేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### బీరువా బహూకరణ



ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు 1977–78 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం బీరువాలు బహూకరించారు. 47 ఏళ్ల క్రితం తాము చదువుకున్న పాఠశాలలో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు నిమ్మ సుదర్శన్ రెడ్డి, రమేష్, దయాకర్, సామేల్, జయప్రకాశ్, ఈశ్వర్, రామమూర్తి, శంఘర్, బుచ్చిమల్లు, చింత శోభతో పాటు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ధర్మప్రకాశ్, ఉపాధ్యాయులు కవిత, సురేష్ కిరణ్మయి, రామకృష్ణ, ప్రసన్న, రమ్యశ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్ద కుర్చీ ఆమెకే సొంతమా..!



పరకాల మండల విద్యావనరుల కేంద్రం

## ఎనిమిది ఏళ్లనుంచి ఇన్‌చార్జ్ ఎంఈఓగా కొనసాగింపు

- పనితీరుపై విద్యార్థి సంఘాల మండిపాటు
- గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు



ఎంఈఓ పనితీరుపై డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు (ఫైల్)

పరకాల : జిల్లా విద్యాశాఖ అధికారులు నలుగురు మారినా.. ఆమె కుర్చీ.. హోదా మాత్రం కదలదు.. పోదు అన్నట్లు తయారైంది. పేరుకే ఇన్‌చార్జ్ మండల విద్యా శాఖాధికారి కానీ గతంలో పనిచేసిన రెగ్యులర్ అధికారుల కంటే ఎక్కువ కాలం (రికార్డు)గా పనిచేశారు. ఇన్‌చార్జ్‌గా ఎనిమిదేళ్లుగా ఆమెనే మండల బాస్‌గా..ఉంటూ ఆ కుర్చీ ఆమెకే సొంతం అన్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంఈఓగా పరకాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రమాదేవిని (ప్రస్తుతం వెల్లంపల్లి హెచ్‌ఎం) నియమించారు. కొద్ది రోజులు పరకాల డివిజన్‌లోని నడికూడ, దామెర, ఆత్మకూరు, శాయంపేట మండలాల ఇన్‌చార్జ్‌గా కూడా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ విద్యాసంవత్సరంలో ప్రతి మండలానికి విద్యాశాఖాధికారి నియామకాలతో ఆయా మండలాల బాధ్యతల నుంచి తొలగించారు.

**ఎంఈఓ పనితీరుపై పలు ఆరోపణలు..**

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో కానీ ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాల ఏర్పాటుపై నిర్లక్ష్యం వహిస్తారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వయంగా ఏ ఒక్క పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి.. ముఖ్యంగా ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకున్న సందర్భాలు లేకపోవడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

**అధికారులకు ఫిర్యాదులు**

సమయపాలనతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డీఈఓకు ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి.

**కావాలనే ఆరోపణలు**

ఓ విద్యార్థి సంఘం నాయకులు కావాలనే నాపై అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. వారు అడిగినవి ఇవ్వకపోతే ఒక విధంగా.. ఇస్తే మరో విధంగా వ్యవహరిస్తున్నారు. తాను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి నాపై లేనిపోని ఆరోపణలు చేయడం సాధారణంగా మారింది. తనపై వచ్చే ఫిర్యాదుకు సమాధానం ఇస్తున్నాను. జిల్లా విద్యాశాఖ అధికారులు తీసుకునే చర్యలకు కట్టుబడి ఉంటా.

– ఎస్.రమాదేవి, ఎంఈఓ, పరకాల

**కుంటుపడుతున్న విద్యావ్యవస్థ**



ఎనిమిదేళ్లుగా ఇన్‌చార్జ్ మండల విద్యాశాఖాధికారిగా ఒక్కరే ఉండడం వల్ల మండలంలో విద్యా వ్యవస్థ కుంటుపడుతుంది. తక్షణమే పరకాల ఎంఈఓగా రమాదేవిని తొలగించి కొత్తవారిని నియమించాలి. లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– మంద శ్రీకాంత్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

# కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలు



కాంగ్రెస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, చిత్రంలో మార్నేని రవీందర్ రావు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

ఐనవోలు : కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని, కొత్త, పాత అనే తేడాలు వదిలి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దిశా నిర్దేశం చేశారు.మంగళవారం మండల పరిధిలోని ఓ రిసార్ట్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం, ముఖ్య నాయకులు, కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావుతో కలిసి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. అందరం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నామని, 'నేను గొప్ప అంటే నేను గొప్ప అని ఎవరికి వారే ఇష్టానుసారంగా కాంగ్రెస్ పార్టీని అప్రతిష్ట పాలు చేయొద్దని' హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా సిద్ధంగా ఉందన్నారు. ఈ నెల 25న నియోజకవర్గ కేంద్రంలో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మార్నేని మధుమతి, పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, నాయకులు కొమ్ముగోని ప్రభాకర్ గౌడ్, పబ్బతి సత్యానారాయణ, బీరం దేవేందర్‌రెడ్డి, పోలెపల్లి బుచ్చిరెడ్డి, ఇల్లందుల ఎలిషా, మునిగాల సమ్మయ్య, బొమ్మినేని రాకేష్‌రెడ్డి, రాయపురం సాంబయ్య, రుగ్వేద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియాపై రైతులకు అవగాహన



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాజేష్

ధర్మసాగర్ : ఎరువులు కూడా నిత్యావసర వస్తువులేనని మండల వ్యవసాయ అధికారి రాజేష్ తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల పంపిణీ కేంద్రం వద్ద రైతులకు యూరియా, నానో ఏరియా వాడకంపై మంగళవారం ఏఓ అవగాహన కల్పించారు. ఎరువులు సూచించిన మేరకే వాడాలని, యూరియా ఎరువు ఒకే దఫా వాడకూడదని, మొదటి దఫా నీం (వేప) కోటెడ్ యూరియా, రెండో దఫా నానో యూరియా వేయడం వల్ల మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఎరువుల అమ్మకాలు నిత్యావసర వస్తువుల చట్టం (ఈసీ యాక్ట్ 1955) కిందికి వస్తుందని, అక్రమ నిల్వలు చేసిన, చట్టాల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి మండలంలో 70 టన్నుల యూరియా ఉందని సరఫరా కూడా నిరంతరంగా జరుగుతుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన వివరించారు.

# ఆర్థికభారం తగ్గించేందుకు సాండ్ బజార్



ఇసుక డంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి, చిత్రంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ స్నేహాశబరీష్

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్ : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం సాండ్ బజార్‌ను (ఇసుక డంపు) ఏర్పాటు చేస్తున్నట్లు స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరలో నాణ్యమైన ఇసుక అందించాలని ధర్మసాగర్ మండలంలోని ఉనికిచర్ల సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. సాండ్ బజార్‌లో ఎప్పటికప్పుడు వినియోగదారులకు సరిపడా ఇసుకను అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఇసుకను ఆన్‌లైన్ లో బుక్ చేసుకోవడం అందరికీ రాదని, బుక్ చేసుకోకుండా వచ్చిన వారికి సిబ్బందే ఆన్‌లైన్ లో బుక్ చేసి ఇసుకను అందించాలని సూచించారు. ఇసుక కోసం వచ్చే వారికి సిబ్బంది ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.వెయ్యికే టన్ను ఇసుక అందించాలని కలెక్టర్‌ను, టీజీఎండీసీ అధికారులను కోరారు .గ్రామాల్లో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టినందున ఇసుక అవసరాలను గుర్తించి గ్రామాల వద్దకే ఇసుక తీసుకెళ్లడానికి మార్గాలను చూడాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉత్సాహంగా ఉన్నారని వారికి కొంత ప్రోత్సాహం అందిస్తే త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఎండీసీ అధికారులు, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

దామెర : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు దామెర ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. కాలగర్భంలో కలిసిన చరిత్రను సజీవంగా నిలిపేదే ఫొటో అని తెలిపారు. ఫొటోగ్రాఫర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### శంకరజ్యోతికి పీహెచ్‌డీ ప్రదానం



దామెర : మండలంలోని కోగిల్వాయికి చెందిన గట్ల శంకరజ్యోతి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఏ స్టడీ ఆన్ రెగ్యులర్ డామినేషన్ ఇన్ లిటాక్ట్ గ్రాఫ్స్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. కాగా ఉస్మానియా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్, వైస్ చాన్సలర్ చేతుల మీదుగా పీహెచ్‌డీని ఆమె అందుకున్నారు. శంకరజ్యోతి ప్రస్తుతం ఖమ్మం జిల్లాలోని ట్రైబల్ గురుకుల డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. పట్టా అందుకున్న సందర్భంగా ఆమెను పలువురు గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు అభినందించారు.

# సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి



ఊరుగొండలో మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

దామెర : సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు శరత్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంతో పాటు ఊరుగొండ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని కోరారు. అదే విధంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన మహా ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బుద్దిరెడ్డి భగవాన్ రెడ్డి, లకావత్ రాజేష్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### పశువులను రోడ్లపై వదలొద్దు

- మున్సిపల్ కమిషనర్ సుష్మా



పాత మున్సిపల్ కార్యాలయానికి తరలించిన పశువులు

పరకాల : పశువులను రోడ్లపై వదిలేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పరకాల మున్సిపల్ కమిషనర్ కె.సుష్మా మంగళవారం హెచ్చరించారు. నియంత్రణ లేకుండా పశువులు (గోవులు) విచ్చలవిడిగా రోడ్లపై సంచరించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయనే ఫిర్యాదులపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్లపై సంచరిస్తున్న పశువులను పాత మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణంలోకి తరలించారు. అనంతరం సంబంధిత పశువుల యజమానులు మున్సిపల్ నిబంధనల మేరకు జరిమానా చెల్లించి తీసుకెళ్లాలని కోరారు. లేనిచో మరో రెండ్రోజుల తర్వాత పశువులను ఆలయాలకు అప్పగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

# రైతులకు తప్పని యూరియా తిప్పలు



వేలేరు: ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు



కమలాపూర్: పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

వేలేరు : యూరియా కోసం స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, పీఏసీఎస్ పీచరలో రైతులు యూరియా కోసం బారులుదీరారు. మండలానికి యూరియా వచ్చిందనే సమాచారంతో రైతులు ఉదయం నుంచే ఆయా కేంద్రాల వద్ద క్యూలో నిల్చుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..యూరియా కోసం పడిగాపులు కాస్తున్నామని, తమకు యూరియా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన రైతులకు ఎకరానికి ఒక బస్తా మాత్రమే ఇస్తున్నారని అవి సరిపోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**యూరియా కోసం బారులు**

కమలాపూర్ : మండలానికి ఇప్పటి వరకు సుమారు 26వేల బస్తాల యూరియా వచ్చిందని వ్యవసాయ అధికారులు తెలిపారు. సోమవారం ఈ–పాస్ సర్వర్ మొరాయించడంతో పంపిణీ నిలిచిపోయిన సుమారు 300కు పైగా బస్తాలను మాత్రమే మంగళవారం రైతులకు పంపిణీ చేయగా సోమవారం ఆ బస్తాలకు సంబంధించి టోకెన్లు పొందిన రైతులు మాత్రమే యూరియా కోసం వచ్చారు. దీంతో మంగళవారం రైతులు బారులుదీరి కనిపించలేదు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ

ఐనవోలు : మండల పరిధిలోని రాంనగర్, పున్నేలు గ్రామాలకు చెందిన పలు కుటుంబాలను మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శించారు. రాంనగర్ గ్రామానికి చెందిన గాదె బాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అదే గ్రామానికి చెందిన కాయిత వెంకన్న అనారోగ్యంతో బాధపడుతుండగా వారి నివాసాలకు వెళ్లి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. పున్నేలుకు చెందిన కటకం ఈశ్వరయ్య, పరుశరాములు ఇటీవల మృతిచెందగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్ అత్తమ్మ రాజేశ్వరి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి బాధిత రాజేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం జోగంపల్లి గ్రామానికి చెందిన మార్క పోశాలు అనారోగ్యంతో మృతి చెందగా పోశాలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రమేశ్, కిష్టయ్య,రాజు,శ్రావణ్ కుమార్ ఉన్నారు.

### గుట్కా ప్యాకెట్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

ధర్మసాగర్ : మండల పరిధిలోని మలక్‌పల్లి గ్రామంలో గల కిరాణా షాపులో నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జానీ పాషా మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నిషేధిత గుట్కా ప్యాకెట్లు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు మూడే సోమనాథం కిరాణాషాపులో తనిఖీ చేశారు. సుమారు రూ.24వేల విలువైన అంబర్ ప్యాకెట్లు, గుట్కాలు లభించాయని వెల్లడించారు. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది భిక్షపతి, కుమారస్వామి, రాములు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి



దామెర: కృత్యమేళాలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

దామెర : విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంఈఓ లకావత్ రాజేష్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం కృత్యమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 14 ప్రాథమిక పాఠశాలలకుగాను 42 కృత్యాలు మండల స్థాయికి వచ్చాయని అన్నారు. ఇందులో 10 కృత్యాలను ఎంపికచేసి జిల్లా స్థాయికి పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ.. నూతన మెళకువలతో విద్యార్థులకు బోధించాలని అన్నారు.కార్యక్రమంలో ఊరుగొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు సతీష్, శ్యామ్‌సుందర్, మహేందర్, అంజన్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఎల్కతుర్తిలో..**

ఎల్కతుర్తి : స్థానిక విద్యావనరుల కేంద్రంలో మంగళవారం మండల స్థాయి కృత్యమేళా ప్రదర్శన నిర్వహించగా ఎంపీడీఓ ఎస్.విజయ్‌కుమార్ ప్రారంభించారు. అన్ని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసిన వివిధ రకాల బోధనోపకరణాలను కృత్యమేళాలో ప్రదర్శించారు. ఈ మేళాను మండల విద్యాధికారితో పాటు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దుర్గభవాని, ఎల్.మనోహర్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై మేళాను తిలకించారు. మండల స్థాయి మేళాలో ప్రదర్శించిన ఉత్తమమైన పది నమూనాలను ఎంపిక చేసి జిల్లాస్థాయికి పంపించామని తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి, కుమారస్వామి, వాణి, సీర్పేలు రాజు, రవి, కుమార్, సుమన సిబ్బంది సురేష్, నర్సింగం పాల్గొన్నారు.



పరకాల: కృత్యమేళాను పరిశీలిస్తున్న అధికారులు, న్యాయనిర్ణేతలు



ఎల్కతుర్తిలో..

**జిల్లా స్థాయికి 10 మంది టీఎల్‌ఎంల ఎంపిక**

పరకాల : పరకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్‌ఎం మేళాను నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కృత్యమేళాను ప్రదర్శించారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి 10 మంది టీఎల్‌ఎంను ఎంపిక చేసినట్లు పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఎంఈఓ రమాదేవి తెలిపారు. హెచ్‌ఎం సురేందర్, మధు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ గౌస్ అభినందించారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

ఆత్మకూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు సత్తాచాటాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి కోరారు. మండలంలోని అక్కంపేట, నాగయ్యపల్లె గ్రామాల్లో మంగళవారం గ్రామ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిందని విమర్శించారు. గ్రామాల్లో ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్ పాలన కోరుకుంటున్నారని చెప్పారు. కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, నాయకులు బొల్లబోయిన రవియాదవ్, సావురే రాజేశ్వర్‌రావు , కూస కుమారస్వామి, రేగుల రవి, దేవరాజు పాల్గొన్నారు.